జై జగన్.. జయహో విశాఖ

- సీఎం ప్రకటనపై హర్షాతిరేకాలు
- వాడవాడలా క్షీరాభిషేకాలు
- వైజాగ్ పరిపాలనా రాజధాని అయితే ఉత్తరాంధ్ర అభివృద్ధి: ఎమ్మెల్యే నాగిరెడ్డి


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పెదగంట్యాడ: జయహో విశాఖ.. మా రాజధాని విశాఖ.. జై జగన్ అంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.. ఇకపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడి నుంచే పాలన సాగించనున్నారంటూ నినాదాలు చేశారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన సదస్సులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటన చేయడంతో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సంబరాలు చేశారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఇప్పుడు విశాఖ రాజధాని ప్రకటన చేశారన్నారు. రెండు నెలల్లో ఇక్కడి నుంచే పరిపాలన సాగించనున్నారని, దీంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పరుగులు పెట్టడం ఖాయమన్నారు. పల్లా చినతల్లి, మార్డుపూడి పరదేశి, రాజాన వెంకటరావు, ధర్మాల శ్రీను, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, సిరట్ల వాసు, గొందేశి వెంకటరమణారెడ్డి, వెంపాడ అప్పారావు, సంపంగి ఈశ్వరరావు, శివ, పిట్టా రెడ్డి, ఏకుల వెంకటేష్ గౌడ్, బ్రహ్మయ్య, చిత్రాడ వెంకటరమణ, వెంకటేష్, ప్రగడ వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో..

కూర్మన్నపాలెం: 87వ వార్డులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, చిత్రాడ కనకసూర్యపద్మావతి, చిత్రాడ వెంకటరమణ, వడ్లపూడి ఈశ్వరరావు, ఎస్.పాపారావు, కె.పారిపల్లి, పి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో..

ఉక్కునగరం: సెంట్రల్ స్టోర్స్ కూడలి యూనియన్ పాయింట్ వద్ద స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. విశాఖ రాజధానిగా ఏప్రిల్ నుంచి పరిపాలన చేస్తామని ప్రకటించడంపై నాయకులు హర్షం ప్రకటించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప మాట్లాడుతూ రాజధానిగా ఉన్న నగరానికి పరిశ్రమలు రావాలంటే నగరాన్ని సుందరీకరణ చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడం కోసం కృషి చేస్తుంటే, తన భార్యను ఎమ్మెల్సీగా గెలిపించుకోవడం కోసం కార్పొరేటర్ గంగారావు కారు కూతలు కూస్తున్నారన్నారు. కార్యక్రమంలో పరదేశి, పిట్టా రెడ్డి, ఎన్నేటి రమణ, డి. పుల్లారావు, నమ్మి ప్రసాద్, పి. సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


87వ వార్డులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

క్లుప్తంగా

'సాయి శివం' ఆధ్యాత్మిక సేవా కేంద్రం ప్రారంభం


ఆధ్యాత్మిక సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు వెంపళ్లనగర్‌లోని నూకాంబిక, రామాంజనేయస్వామి ఆలయం పక్కన కొత్తగా నిర్మించిన సాయి శివం సత్యసాయి ఆధ్యాత్మిక, సామాజిక సేవా కేంద్రాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి బుధవారం ప్రారంభించారు. సత్యసాయి సింహాసనాన్ని ఆవిష్కరించారు. సత్యసాయి సేవా సమితి (పెదగంట్యాడ), సత్యసాయి భజనమండలి (వెంపళ్లనగర్) ప్రతినిధి గళ్లా శంకర్‌సాయిరాం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, బాబూరావు, లోకేష్, చంద్రశేఖర్, గోవింద, ట్రస్ట్ సభ్యులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

అగనంపూడి: వాసవి క్లబ్ అగనంపూడి నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అగనంపూడిలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎనుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వేటూరి గున్నయ్య శెట్టి, పుట్టా రమేష్, కోశాధికారిగా తాతా కనకం ఎన్నికయ్యారు. వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా కె.ఎస్.కనక మహాలక్ష్మి, బత్తుల మంగ, కోశాధికారిగా పి.లలితలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా వుడా త్రినాథరావు, పీఎస్ వరహాలరావు వ్యవహరించగా, కమిటీ నాయకులు మయూరి బుజ్జి, గున్నేశ్వరరావు, కోటి, నానాజీ, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ట్రక్

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ సమీపంలో ఓ కారును లారీ ఢీకొన్న ఘటనలో కారు బోల్తాపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఒకరికి స్వల్ప గాయాలు కాగా, మరొకరు సురక్షితంగా బయటపడ్డారు. వివరాలివి.. గాజువాక నుంచి సిటీ వైపు వెళ్తున్న ఇన్నోవా కారులో రాము, రాజు అనే ఇద్దరు వ్యక్తులున్నారు. షీలానగర్ నుంచి ఎయిర్‌పోర్టు మధ్యలో మొదటి బ్రిడ్జి దాటిన తర్వాత స్టీల్‌ప్లాంట్ నుంచి రాయ్‌పూర్‌కు ఐరన్ రాడ్‌ల లోడుతో వెళ్తున్న లారీని ఇన్నోవా కారు ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నించగా.. హఠాత్పరిణామానికి లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో కారు మధ్యభాగంలో ఢీకొంది. దీంతో కారు పక్కకు పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రాజు డ్రైవర్ రాజు క్షేమంగా బయటపడగా, మరో వ్యక్తి రాము చేతికి స్వల్పగాయం అయ్యింది. ఆ సమయంలో షీలానగర్ సిగ్నల్ పాయింట్ నుంచి కిలోమీటర్ వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. గాజువాక సీఐ ఆర్.సత్యనారాయణ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ యూసఫ్ ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న కారును స్థానికుల సాయంతో రోడ్డు పక్కకు చేర్చారు. లారీ డ్రైవర్, కారు యజమాని నుంచి వివరాలు సేకరించి, దర్యాప్తు చేపట్టనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.


రోడ్డుపై బోల్తా పడిన కారు

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అక్కిరెడ్డిపాలెం: మింది విద్యుత్ సబ్ స్టేషన్ 11 కేవీ ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. మింది, రాజీవ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు.

అర్హులందరికీ లబ్ధి


మహిళకు ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికీ సంక్షేమ పథకాలను అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో చర్యలు చేపట్టారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో గోపాలరెడ్డినగర్‌లో బుధవారం ఆయన పర్యటించారు. లబ్ధిదారులను కలిసి, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, శంకరనారాయణ, ప్రమీల, పెంటారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చురుగ్గా పెన్షన్ల పంపిణీ


పెన్షన్ అందిస్తున్న కన్వీనర్, గృహసారథి

పెదగంట్యాడ: నియోజకవర్గంలో బుధవారం పింఛన్ల పంపిణీ చురుగ్గా సాగింది. జీవీఎంసీ 77వ వార్డు పరిధి పెదపాలెంలో లబ్ధిదారులకు వలంటీర్‌తో పాటు కొత్తగా నియమితులైన కన్వీనర్లు, గృహసారథులు పెన్షన్లు అందించారు. శంషద్ బేగం, గుల్షన్ బేగం, జబ్బర్, మదీనా, నసీరా, నస్రత్ జాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీలో మంచానికే పరిమితమైన, మెదడు ఎదుగుదల లేని బాలుడు పిండి సూర్యవెంకట్‌కు నగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం రాజేష్, కుమార్, సచివాలయ కన్వీనర్ గుర్రం త్రినాథ్, అమ్మాజీ, కోటేశ్వరరావు, వలంటీర్ కల్యాణి పింఛన్ అందజేశారు.

అప్పికొండలో మహా శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

పెదగంట్యాడ: అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదేశించారు. 77వ వార్డులోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున, అందుకు తగినట్లుగా ఏర్పాట్లు ఉండాలన్నారు. బందోబస్తు, వాహనాల పార్కింగ్, క్యూ లైన్ల ఏర్పాటు, ప్రత్యేక ఆర్టీసీ బస్సులు తదితర అంశాలపై వివరంగా చర్చించారు. అనంతరం పిట్టవానిపాలెం పైడితల్లి అమ్మవారి పండగ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, ఈవో శ్రీనివాసరావు, తహసీల్దార్ రమాదేవి, దువ్వాడ సీఐ శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఎస్‌బీఐ అకౌంట్లు

గాజువాక: గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు భారతీయ స్టేట్ బ్యాంక్ పాతగాజువాక శాఖ సిబ్బంది జీరో బ్యాలెన్స్ అకౌంట్లను ప్రారంభించింది. పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 280 మంది విద్యార్థులకు ఈ అకౌంట్లను ప్రారంభించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.అరుణ్ కుమార్ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో గ్రామ దేవతలు కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ వార్ల నూతన ఆలయాల నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి , 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్, కార్పొరేటర్ ఉరుకూటి చందు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి గణేష్ నగర్-2, కణితి ఏకలవ్య వీధి-1లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తడి, పొడి చెత్త విభజన, సేంద్రియ ఎరువుల తయారీ, విద్యుత్ ఉత్పత్తి, ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై జెడ్సీ సింహాచలం, సిబ్బంది వివరించారు. ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్ వెంకటాద్రిపై కొలువుదీరిన కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు తిప్పల రమణారెడ్డి, అన్నపూర్ణ దంపతులు మాట్లాడుతూ ఈ నెల 5 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నామని తెలిపారు. ప్రతి రోజూ ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.

720వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 720వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. పోరాట కమిటీ నాయకులు కారు రమణ, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సమస్యలపై వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సమస్యలపై రాష్ట్ర పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాకేష్ రెడ్డి సీఎండీ అతుల్ భట్‌తో చర్చించారు. బుధవారం ఆయన ఉక్కు పరిపాలన భవనంలో సీఎండీని కలిసి మాట్లాడారు. వేతన బకాయిల చెల్లింపు, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి తదితర అంశాలపై మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగేలా సహకరించాలని కోరారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు, జి. గోవిందరాజు, గాజువాక కాంగ్రెస్ సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత మృతి కేసులో నలుగురి అరెస్టు

కూర్మన్నపాలెం: వివాహిత మృతి కేసులో దువ్వాడ పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. వివరాలివి.. అగనంపూడి తలారివానిపాలెం ప్రాంతానికి చెందిన వివాహిత సర్వసిద్ధి ఝున్సీ (23) జనవరి 29వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయితే, తన బిడ్డ చనిపోవడానికి ఆమె భర్త, అతని కుటుంబ సభ్యులే కారణమని మృతురాలి తల్లి జయమ్మ ఫిర్యాదు ఇచ్చారు. దీంతో దువ్వాడ పోలీసులు పెందుర్తిలోని అక్కిరెడ్డిపాలేనికి మృతురాలి భర్త బంధం రవిని, అత్తమామలు చినతల్లి, దేముడిని, ఆడపడుచు కిలారి ధనలక్ష్మిని బుధవారం అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఎస్‌పీఎల్‌లో అర్ధ సెంచరీల మోత

దొండపర్తి (విశాఖ దక్షిణ): సాక్షి ప్రీమియర్ లీగ్ తుది అంకానికి చేరుకుంది. బుధవారం ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో జరిగిన మ్యాచ్‌ల్లో అర్ధ సెంచరీల మోతతో భారీ స్కోర్లు నమోదయ్యాయి. ఉదయం మూడో స్థానం కోసం మ్యాచ్‌లు జరగగా... మధ్యాహ్నం సెమీఫైనల్స్ జరిగాయి. వీటిలో బ్యాట్స్‌మెన్ అర్ధ సెంచరీలతో ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపించి తమ జట్లను ఫైనల్స్‌కు చేర్చారు. గురువారం ఉదయం జూనియర్స్ విభాగంలో జరిగే ఫైనల్ పోరులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ (కంచరపాలెం), సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్ (గిడిజాల) తలపడనున్నాయి. అలాగే సీనియర్ విభాగంలో ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ (శొంఠ్యాం), దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అనకాపల్లి) జట్ల మధ్య ఫైనల్స్ పోరు జరగనుంది. విజేతలకు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ చేతుల మీదుగా బహుమతుల ప్రధానోత్సవం జరగనుంది. సాక్షి మీడియా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు సీఎంఆర్ షాపింగ్ మాల్ జిల్లా స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.

14 పరుగుల తేడాతో ఎస్ఎస్ఆర్ఐటీ విజయం

బుధవారం ఉదయం జరిగిన తొలి మ్యాచ్‌లో ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ జట్టు (శొంఠ్యాం) 14 పరుగులు తేడాతో జీవీపీ కాలేజ్ ఫర్ డిగ్రీ అండ్ పీజీ జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన జీవీపీ కాలేజ్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జీవీపీ కాలేజ్ 9.3 ఓవర్లలో 70 పరుగులు చేసి ఆలౌట్ అయింది.


శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు


దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు


ఫైనల్స్‌కు చేరుకున్న ఎస్ఎస్ఆర్ఐటీ జట్టు

8 పరుగులు తేడాతో శ్రీ కాశ్యప్ విజయకేతనం

రెండో మ్యాచ్‌లో అవంతి ఇంజనీరింగ్ కాలేజ్ (నర్సీపట్నం), శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ (శ్రీనగర్) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 73 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టపోయి కేవలం 65 పరుగులు మాత్రమే చేసింది. శ్రీ కాశ్యప్ జట్టు 8 పరుగుల తేడాతో విజయం సాధించింది.

9 వికెట్ల తేడాతో డైట్ కాలేజ్ భారీ విజయం

మధ్యాహ్నం జరిగిన తొలి సెమీఫైనల్స్ మ్యాచ్‌లో రఘు ఇంజినీరింగ్ కాలేజ్(దాకమర్రి), దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్లు (అనకాపల్లి) తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన రఘు ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు 9 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే నష్టపోయి 80 పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించి ఫైనల్స్‌కు చేరుకుంది.

భారీ విజయంతో ఫైనల్‌కు ఎస్ఎస్ఆర్ఐటీ

మధ్యాహ్నం జరిగిన నాలుగో మ్యాచ్ సెమీ ఫైనల్స్‌లో ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ 46 పరుగుల భారీ ఆధిక్యంతో శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్‌పై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్ఎస్ఆర్ఐటీ జట్టు నిర్ణత 10 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 95 పరుగుల స్కోరు నమోదు చేసింది. భారీ విజయలక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి కేవలం 49 పరుగులు మాత్రమే చేయగలిగింది.

షాలిమార్ - తాంబరం స్పెషల్ రద్దు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): షాలిమార్-తాంబరం-షాలిమార్(08041/08042) వీక్లీ స్పెషల్‌ను రద్దు చేస్తున్నట్లు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

రాంచీ - విల్లుపురం - రాంచీ మధ్య స్పెషల్స్

దక్షిణ భారతదేశంలోని వలస కార్మికుల సౌకర్యార్థం రాంచీ - విల్లుపురం - రాంచీ (08068 / 08067) మధ్య వీక్లీ స్పెషల్స్ నడుపుతున్నట్లు త్రిపాఠి తెలిపారు. ప్రతీ శుక్రవారం రాంచీలో మధ్యరాత్రి 11.55 గంటలకు బయల్దేరి దువ్వాడ మీదుగా ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విల్లుపురంలో ప్రతీ మంగళవారం సాయంత్రం 5.15 గంటలకు బయల్దేరి గురువారం ఉదయం 6.45కు రాంచీ చేరుకుంటుంది. ఈ వీక్లీ స్పెషల్ రైలు ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 28 వరకు నడుస్తుంది.

➡ మచిలీపట్నం - విశాఖపట్నం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌కు మరో మూడు స్లీపర్ క్లాస్ కోచ్‌లను అదనంగా జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

యూరోపియన్ సదస్సుకు అపోలో వైద్యుడు

ఆరిలోవ(విశాఖ తూర్పు): ఈ ఏడాది మే నెలలో జరగనున్న యూరోపియన్ వార్షిక సదస్సుకు హాజరు కావాలని హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రికి చెందిన ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ అబ్దుల్ డి.ఖాన్‌కు ఆహ్వానం అందింది. యూరోపియన్ ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ ఇన్ ఆర్థోపెడిక్స్ అండ్ ట్రమటాలజీ(ఎఫెర్ట్) ఆధ్వర్యంలో యూరప్ ఖండం వియన్నాలో ఈ సదస్సు జరగనుంది. అపోలోలో తాను విజయవంతంగా నిర్వహించిన రెండు సర్జరీలకు సంబంధించిన కథనాలపై ఈ సదస్సులో మౌఖిక ప్రదర్శన చేస్తానని ఖాన్ బుధవారం తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చాలని వినతి

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమురు నాగేశ్వరరావును పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యల మీద మంత్రికి వినతి పత్రం సమర్పించారు. తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న సుమారు 750 మంది అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్పు చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

ఇంటర్ పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ

ఆర్ఐవో సత్యనారాయణ

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆర్ఐవో ఆర్.సత్యనారాయణ తెలిపారు. పరీక్షల నిర్వహణకు సన్నద్ధత చేసే క్రమంలో ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు బుధవారం వెబెక్స్ ద్వారా సమీక్షించారు. నగరంలోని ఆర్ఐవో కార్యాలయం నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ప్రాక్టికల్స్, వార్షిక పరీక్షల నిర్వహణకు ఉమ్మడి విశాఖ జిల్లాలో చేస్తున్న ఏర్పాట్లపై ఉన్నతాధికారులకు ఆర్ఐవో వివరించారు. విశాఖలో 185, అనకాపల్లిలో 136, అల్లూరి జిల్లాలో 39 జూనియర్ కాలేజీల నుంచి మొదటి సంవత్సరం 56,437 మంది, రెండో సంవత్సరం 56,625 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రైవేట్‌గా 8,116 మంది పరీక్షలకు ఫీజు చెల్లించినట్లు వివరించారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ కోసం తగిన సౌకర్యాలు ఉన్న కాలేజీలను ఇప్పటికే గుర్తించినట్లు చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరీక్ష కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేసేలా ఇప్పటికే కళాశాల ప్రిన్సిపాళ్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. అనకాపల్లి జిల్లా డీవీఈవో బి.సుజాత, కార్యాలయ పర్యవేక్షకుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సంజీవని నిధికి 'ఇంటర్' విరాళం రూ.50 వేలు


కలెక్టర్ మల్లికార్జునకు చెక్ అందజేస్తున్న ఆర్ఐవో

విశాఖ విద్య: జిల్లా కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సంజీవని నిధికి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల తరఫున రూ.50 వేలను వితరణ ఇచ్చారు. దీనిని చెక్కు రూపంలో ఆర్ఐవో ఆర్.సత్యనారాయణ బుధవారం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు అందజేశారు. జిల్లాలోని 10 కాలేజీల నుంచి రూ.50 వేలు సేకరించగా, ఇందులో ఒక్క పెందుర్తి కాలేజీ నుంచే రూ. 20 వేలు ఇచ్చారు. నిరుపేదలకు ఆరోగ్య పరంగా అత్యవసర సమయంలో ఆర్థిక సాయం అందించేందుకు ఏర్పాటు చేసిన సంజీవని నిధికి తోచిన రీతిలో వితరణ ఇచ్చేందుకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ముందుకు వస్తుండటం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లను ఈ విషయంలో చైతన్యం తీసుకొచ్చిన ఆర్ఐవోను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

విశాఖ టు ఢిల్లీ ప్రజాపోరు యాత్ర

సీతంపేట: కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని, దీనిపై ఈ పార్లమెంట్ సమావేశాలలో బిల్లు పెట్టాలని కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జెర్రిపోతుల పరశురామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్ నుంచి ఢిల్లీ వరకు ప్రజాపోరు రథయాత్ర చేపట్టారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి మిట్ట రామారావు, దళిత ద్రావిడ పార్టీ జాతీయ అధ్యక్షుడు మళ్ల జీవన్ కుమార్, సీపీఎస్ జాతీయ సలహాదారు ఆళ్ళ రామకృష్ణ జెండా ఊపి యాత్రకు శ్రీకారం చుట్టారు. పరశురామ్ మాట్లాడు తూ ఈ డిమాండ్ సాధన కోసం గత ఐదేళ్లలో పాదయాత్ర, ప్రజా చైతన్య రథయాత్ర, జ్ఞానయుధ యాత్ర, ఢిల్లీలో మహాధర్నా నిర్వహించామని, 8మంది ఎంపీలతో మాట్లాడినట్టు తెలిపారు. మిగతా ఎంపీలతో మాట్లాడి పార్లమెంట్‌లో బిల్లుపెట్టాలన్న లక్ష్యంతో ఇప్పుడు ప్రజాపోరు యాత్ర తలపెట్టామన్నారు. సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కంత వేణు, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం ఎన్నికల అధికారిగా జీఎం రెడ్డి

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది జి.మహేశ్వర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. 2023-24 సంవత్సరానికి సంఘం వార్షిక ఎన్నికలు ఈ నెల 24న నిర్వహించేందుకు రాష్ట్ర బార్ కౌన్సిల్ ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, క్రీడా, గ్రంథాలయ కార్యదర్శులు, సీనియర్ సభ్యులతో పాటు మహిళా ప్రతినిధిని, మరో 10 మంది సాధారణ సభ్యులను ఎన్నుకుంటారు. వివిధ పదవులకు పోటీ చేస్తున్న అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం ముమ్మరం చేశారు.

24 మంది సచివాలయ కార్యదర్శులకు మెమోలు

మధురవాడ : జీవీఎంసీ జోన్ - 2లో గల వివిధ వార్డు సచివాలయాల్లో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 24 మంది అడ్మిన్ సెక్రటరీలకు మెమోలు ఇచ్చినట్టు జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి చెప్పారు. ఎన్నిసార్లు చెప్పినా వీరి పని తీరులో మార్పు రాకపోవడంతో మెమోలు జారీ చేశారు. ముఖ్యంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సిటిజన్స్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు చర్యలు చేపట్టారు. 10 సచివాలయాల్లో సున్నా రిజల్ట్ ఉండడంతో ఆగ్రహం వ్యక్త చేశారు. మార్పు రాకపోతే మరింత కఠిన చర్యలు చేపడతామని కనక మహాలక్ష్మి చెప్పారు.

4న జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశం

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం 4న శనివారం నిర్వహించనున్నారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన ఒకటి నుంచి ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షన నిర్వహించనున్నట్టు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 4న ఉదయం పది గంటల నుంచి సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

విశాఖ డెయిరీ ఉద్యోగుల రక్తదానం


రక్తదానంలో పాల్గొన్న ఉద్యోగులు, కార్మికులతో డెయిరీ చైర్మన్ ఆనంద్ కుమార్

అక్కిరెడ్డిపాలెం: రక్తదానం ప్రాణదానంతో సమానమని, అందుకు ముందుకు వచ్చిన ఉద్యోగులు అభినందనీయులని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. విశాఖ డెయిరీ మాజీ చైర్మన్ ఆడారి తులసీరావు జయంతి సందర్భంగా డెయిరీలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 200మంది ఉద్యోగులు, కార్మికులు పాల్గొని రక్తదానం చేశారు. వారికి ఆడారి ఆనంద్ కుమార్, డెయిరీ ఎండీ ఎస్.వి.రమణ సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. విశాఖ డెయిరీ యాజమాన్యం, కిమ్స్ ఐకాన్ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా ఈ రక్తదాన శిబిరం నిర్వహించాయి. కిమ్స్ ఐకాన్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి కిరణ్‌కు జ్ఞాపికను బహూకరించారు. డెయిరీ బోర్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.